**Andhrajyothy**
**Title :**
**Author :**
**Location :**
**Article Date : 03/29/2014**

# ‘గేట్’లో రాష్ట్ర విద్యార్థుల సత్తా

- మైనింగ్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన భరత్ రెడ్డి
- ఆర్.జయప్రకాశ్‌కు 9వ ర్యాంకు.. వై.వంశీకృష్ణకు 14వ ర్యాంకు
- 8, 25, 30, 57, 75 ర్యాంకులు సాధించిన ఆర్‌జీయూకేటీ విద్యార్థులు





హైదరాబాద్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ‘గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్)’లో రాష్ట్ర విద్యార్థులు సత్తా చాటారు. కరీంనగర్ జిల్లా ఓబులాపురం గ్రామానికి చెందిన గోపు భరత్‌రెడ్డి మైనింగ్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఇతనికి నూటికి 69 మార్కులు వచ్చాయి. వ్యవసాయ కుటుంబానికి చెందిన భరత్ రెడ్డి ఐఎస్‌ఎం ధన్‌బాద్‌లో మైనింగ్ ఇంజనీరింగ్ చేస్తున్నాడు. ఇంకా.. రాష్ట్రానికి చెందిన పలువురు విద్యార్థులు వివిధ బ్రాంచ్‌లలో ర్యాంకులు సాధించారు. వరంగల్‌కు చెందిన ఆర్.జయప్రకాశ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో 9వ ర్యాంక్, హైదరాబాద్‌కు చెందిన వై.వంశీ కృష్ణ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్‌లో 14వ ర్యాంక్ పొందారు. రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయానికి చెందిన ఐదుగురు విద్యార్థులు 100 లోపు ర్యాంకులు పొందారు. ట్రిపుల్ ఐటీ-బాసర క్యాంపస్‌లో చదువుతున్న టి.నవీన్‌కు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగంలో ఎనిమిదో ర్యాంక్ దక్కింది. ట్రిపుల్ ఐటీ-నూజివీడు క్యాంపస్‌లో చదువుతున్న జి.మహేష్‌కు 25, జి.శ్రీరాములు నాయుడుకు 30, ఆర్.నీలిమకు 57, ఎల్.కార్తీక్‌కు 75వ ర్యాంక్ వచ్చాయి. తొలిసారిగా కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించిన ‘గేట్-2014’ పరీక్షకు దేశ వ్యాప్తంగా 8,89,156 మంది హాజరయ్యారు.